మూడో వారంలో కొనుగోలు కేంద్రాలు

- పాలమూరులో 28 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర





ఈనాడు, మహబూబ్‌నగర్: భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులు ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను తీసుక రావాలని సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ డీజీఎం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసారి పత్తి క్వింటాకు రూ.7,521 మద్దతు ధరను సంస్థ ప్రకటించిందని చెప్పారు. పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల మూడోవారంలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిన్నింగ్ మిల్లులు, రవాణాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై డీజీఎం 'ఈనాడు' ముఖాముఖీలో వెల్లడించిన అంశాలివి ఉన్నాయి.

సీసీఐ డీజీఎం మహేశ్వర్‌రెడ్డితో ముఖాముఖి

? సీసీఐ ద్వారా విక్రయించే రైతులకు డబ్బులు రావడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు?

✓ సీసీఐ ద్వారా పత్తి విక్రయించే రైతులకు వారంలోగా డబ్బు ఖాతాలో జమవుతాయి. ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను మాత్రమే రైతు తీసుకురావాలి. కేవైసీ చేసుకోకుంటే డబ్బు రావడంలో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. కేంద్రాలకొచ్చే సమయంలో రైతు తన ఆధార్‌కార్డు తీసుకురావాలి. రైతు రాలేని పరిస్థితి ఉంటే కుటుంబ సభ్యుడిని పంపించవచ్చు. దీనికి సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువపత్రం తీసుకురావాలి.

? ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఎంత? దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేస్తున్నారు?

✓ ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,43,237 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. వీటి ద్వారా 08 లక్షల బేళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

? పత్తికి మద్దతు ధర ఎలా ఉంది? వర్షానికి పంట దిగుబడి, తేమ శాతంపై ప్రభావం చూపితే రైతుల పరిస్థితి ఏమిటి?


✓ పత్తికి సీసీఐ మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించింది. తేమ శాతం 8-12 మధ్యలో ఉండేలా చూసుకోవాలి. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర ఉంటుంది. తేమ శాతంలో తేడా ఉంటే ధరలో స్వల్ప మార్పు ఉంటుంది.

? రెండేళ్లుగా రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. నష్టపోతున్నారు? సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు? ఈ సారి అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలున్నాయా?

✓ గత రెండేళ్ల ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాకు సీసీఐ మద్దతు ధర కంటే అధికంగా రేటు పలికింది. చాలా మంది రైతులు ప్రైవేటు మార్కెట్లకు విక్రయించారు. తర్వాత విపణిలో పత్తికి డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈసారి సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి.

? పత్తి కొనుగోలు కేంద్రాలెక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

✓ పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్-2, నాగర్‌కర్నూల్-18, నారాయణపేట-8, వనపర్తి-1, జోగులాంబ గద్వాలలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. టెండర్లలో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను త్వరలోనే నోటిఫై చేస్తాం. రవాణా కోసం వాహనాల టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.



20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: గద్వాల మండలంలోని తుర్కోనిపల్లి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు గ్రామీణ ఠాణా ఎస్సై శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన ఎరుకలి శివకుమార్, రాముడు, చంద్రలు పలువురి నుంచి సేకరించిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బొలేరో వాహనంలో షాద్‌నగర్‌కు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం పట్టుకున్నట్లు చెప్పారు. కాగా ఆదివారం సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహాలక్ష్మి రాయితీ ఏదీ?

సాంకేతిక కారణాలతో లబ్ధిదారులకు అందని వైనం



ఇటిక్యాల ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

రాజోలి, ఇటిక్యాల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్లను రాయితీపై అందిస్తోంది. రూ.500 లకే సిలిండర్ పొందాలంటే లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ రాయితీకి దరఖాస్తు చేసి ఉండాలి. అయితే ప్రభుత్వం అందించే రాయితీ అందక పలువురు వినియోగదారులు గ్యాస్ సరఫరా ఏజెన్సీలు, ఎంపీడీవో కార్యాలయాల తిరుగుతున్నారు. జిల్లాలో మొత్తం 1.60 లక్షల రేషన్‌కార్డు కుటుంబాలున్నాయి. ఇందులో 1.30 లక్షల కుటుంబాలకు పైగా గ్యాస్ కనెక్షన్లున్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో 1.20 లక్షల మందికి పైగా రాయితీ కోసం దరఖాస్తు చేసినట్లుగా సమాచారం. గ్యాస్ సిలిండర్ కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం రూ.46.43 పైసలు అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.325 రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇలా ఇప్పటి వరకు 84,335 కుటుంబాలు రాయితీని అందుకోగా, లబ్ధిపొందని వారి సంఖ్య కూడా వేలల్లోనే ఉంది.

ఆన్‌లైన్‌లో కనిపించని దరఖాస్తులు: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క లబ్ధిదారుని పేరు ఎంపీడీవోల పర్యవేక్షణలో కార్యదర్శులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. కొందరు లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఒక్క ఇటిక్యాల మండలంలోని 800 మందికి పైగా ఇలా ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ చేసే క్రమంలో గ్యాస్ నంబర్ లేదా రేషన్‌కార్డు, ఆధార్ సంఖ్యలు తప్పుగా నమోదు చేయడమే దీనికి కారణాలు. ఇలాంటి వాటిని ప్రస్తుతం ఎడిట్ చేసేందుకు అవకాశం లేదు. అలాగే కుటుంబంలో భర్త పేరుపై సిలిండర్ ఉండి, భార్య పేరుపై దరఖాస్తు ఉంటే రాయితీ అందడం లేదు. కొత్తగా నమోదుకు అవకాశం లేకపోవడంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అవకాశం ఇస్తే

ప్రజాపాలన దరఖాస్తు సమయంలో లబ్ధిదారులు ఏవైనా తప్పులు చేసి ఉంటే రాయితీ రావడం లేదు. గతంలో సవరించుకోవడానికి, అధికారులు ఇంటింటి తనిఖీలు చేసే సమయంలో లబ్ధిదారులు సరిచూసుకోవాల్సింది. కొత్త దరఖాస్తులు, సవరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇస్తే లబ్ధిదారులకు రాయితీ అందుతుంది.

–స్వామికుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, గద్వాల



ఆన్‌లైన్‌లో లేదంటున్నారు: ప్రజాపాలన కార్యక్రమం సమయంలో మేము దరఖాస్తు చేశాం. ఇందుకు అధికారులు రసీదు కూడా ఇచ్చారు. గ్యాస్ రాయితీ రావడం లేదని అధికారుల వద్దకు వెళ్లి అడిగితే వారు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. మీ దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదు, మేమేమీ చేయలేం అంటున్నారు. ఎవరో చేసిన పొరబాటుకు మేము రాయితీ కోల్పోవాల్సి వస్తోంది. మాలాంటి వారి కోసం ప్రభుత్వం దరఖాస్తుల నమోదుకు అవకాశం ఇవ్వాలి.

–నాగేశ్వరమ్మ, ఇటిక్యాల



కార్యాలయాల చుట్టూ తిరిగినా : ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తు ఉన్నా.. మాకు గ్యాస్ రాయితీ అందడం లేదు. దీనికోసం ఎంపీడీవో, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ పలుమార్లు తిరిగి వారు చెప్పినట్లుగా గ్యాస్ నంబర్, ఆధార్ నంబర్ రాయించాను. అయినా ఫలితం లేదు. గట్టిగా అడిగితే ఆన్‌లైన్‌లో సవరించడానికి రావడం లేదు. మేమేం చెయ్యాలి అంటున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

– పద్మ, రాజోలి


తుంగభద్రలో భారీగా పెరిగిన ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే : కర్ణాటక పరిధిలోని పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగి 43,627 క్యూసెక్కులకు చేరింది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 10.8 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.6 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.6 అడుగులుగా ఉంది. ● రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి ఆదివారం ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి జలాశయానికి 29,150 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో డ్యాంలోని 6 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి, దిగువకు 26,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లుగా జేఈ రాజు తెలిపారు. వర్షాల కారణంగా వరద పెరిగిందని, ప్రస్తుతం జలాశయంలో 291.60 మీటర్ల నీటిమట్టం, 1.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు.


సుంకేసుల నుంచి విడుదలవుతున్న వరద నీరు

గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట!

కొత్త నిబంధన తేనున్న ప్రభుత్వం?


ధరూరు మండలం సాగైన వరి పంట

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.500 వరకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి తర్వాత స్థానంలో వరి ఉంది. జూరాల ప్రాజెక్టుతో పాటు ఎత్తిపోతల పథకాలు చెరువులు, బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. సాగువిస్తీర్ణం దాదాపు 6.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 80 శాతానికిపైగా సన్నధాన్యమే ఉంటుంది. దసరా నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తేవటానికి కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కొలుస్తారట: చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించటం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యం గుర్తించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు పౌరసరఫరాల శాఖ సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొలిచేదిలా: ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు. ఒక ప్రత్యేక పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లకన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. అటువంటి వాటికే రూ.500 బోనస్ చెల్లిస్తారు.

ఎగ్గొంటేదుకేనా: సన్నరకం ధాన్యలేవి అన్నదానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202తో పాటు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని సూచించింది. అయితే ఈ 37 రకాల్లో మన ఉమ్మడి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలుంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే ఎలాగని రైతులంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొంటేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి వస్తోందని రైతులంటున్నారు.

పక్కరాష్ట్రంలో రేటెక్కువుంటే: ఇక ఉమ్మడి జిలాలో గద్వాల, నారాయణపేట వనపర్తి జిల్లాలకు సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్ ఉంది. గతేడాది రూ.3,300 వరకు క్వింటా సన్నరకం ధాన్యం ధర పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కలిపినా పక్కరాష్ట్రంలో ఉన్న ధరకన్నా తక్కువే అవుతుంది. ఈ సారీ అదే ధర పలికితే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉండదు.

మార్గదర్శకాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల ఎంపిక పూర్తయింది. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యత తదితరాల పరిశీలనకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. వస్తే ఆ ప్రకారమే అమలు చేస్తాం.

-విమల, పౌరసరఫరాల అధికారిణి, జోగులాంబ జిల్లా

ఉపాధ్యాయ ఖాళీలు మిగలకుండా ఏర్పాట్లు

మొదట ఎస్ఏల భర్తీ ● త్వరలో పాఠశాలలకు కొత్త టీచర్లు


ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రుపత్రాల పరిశీలన ముగిసింది. ఈ నెల 1 నుంచి 5 వరకు ధ్రువపత్రాలను పరిశీలన చేయాల్సి ఉండగా మొదటి రోజు సాంకేతిక కారణాలతో ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగు రోజుల్లో ఒక్కో పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రుపత్రాల పరిశీలన చేపట్టారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే సమయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా ఖాళీలను భర్తీ చేస్తే మళ్లీ అధిక సంఖ్యలో మిగిలిపోయే అవకాశం ఉంది. ఉపాధ్యాయ పదోన్నతుల సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు రెండు, మూడు సబ్జెక్టుల్లో అదనపు అర్హతలు సాధించడంతో వారు ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు వారికి ఆసక్తి ఉన్న ఏదో ఒక పోస్టును ఎన్నుకోవడంతో ఖాళీల ఇబ్బంది ఏర్పడింది. దీంతో మొదటి ఎస్ఏ ఖాళీలకు 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి ఏ పోస్టును ఎంపిక చేసుకుంటారన్న విషయంలో ముందుగా డిక్లరేషన్ తీసుకున్నారు. ఎస్ఏ ఖాళీలను భర్తీ చేసిన తరువాత ఎస్జీటీలో వారు అర్హత సాధిస్తే అవి ఖాళీలుగా మిగిలి పోనున్నాయి. ఆ పోస్టుల్లో తదుపరి ర్యాంకు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి అన్ని ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో 10 నుంచి 25 మంది అభ్యర్థులు రెండు, మూడు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు.

జిల్లా	ఖాళీలు	దరఖాస్తుల పరిశీలన		
		అభ్యర్థులు	హాజరు	గైర్హాజరు
గద్వాల	172	416	387	29
మహబూబ్‌నగర్	243	576	552	24
నాగర్‌కర్నూలు	231	617	575	42
నారాయణపేట	279	664	585	79
వనపర్తి	152	363	341	22

2,440 మంది ధ్రువపత్రాలు పరిశీలన : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఉమ్మడి జిల్లాలో 2,440 మంది హాజరయ్యారు. మొత్తం 1,077 ఖాళీల భర్తీకి 2,636 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా 196 మంది గైర్హాజరయ్యారు. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్లు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దానికి సంబంధించిన అభ్యర్థుల ధ్రుపత్రాల పరిశీలన చేపట్టలేదు. కోర్టు నిర్ణయం తరువాత ఈ పోస్టుల విషయంలో చర్యలు తీసుకోనున్నారు. ఖాళీల భర్తీతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

తుది జాబితాల తయారీపై దృష్టి..: ధ్రుపత్రాల పరిశీలన పూర్తి కావడంతో తుది జాబితా రూపొందించడంపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి సమాచారం అందజేయనున్నారు. ఎంపికైన వారికి 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రుపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశామని త్వరలో తుది జాబితాలను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగర్‌కర్నూల్ డీఈవో డా.గోవిందరాజులు తెలిపారు. ఎస్ఏల ఖాళీల భర్తీ తరువాత వారు ఎస్జీటీలో కూడా ఎంపికైతే పేరు తొలగించి ప్రతిభ ఆధారంగా తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామన్నారు.

యువతకు ప్రాధాన్యం: మంత్రి

అలంపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ హరిత టూరిజంలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పటిష్ఠం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివిధ శాఖల్లో 60 వేల ఉద్యోగాలను 10 నెలల్లో భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని మంత్రి వివరించారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రతి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి పురావస్తు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రి ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో రుద్ర హోమం, అభిషేకం, జోగులాంబ ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, తదితరులున్నారు.


అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు

మంత్రి ఆదేశాలతో కదలిక వచ్చేనా!

ర్యాలంపాడు జలాశయానికి మరమ్మతులు


రెండు టీఎంసీల నిల్వకే పరిమితమవుతున్న జలాశయం

గద్వాల, న్యూస్‌టుడే: నెట్టంపాడు పథకంలో కీలకమైంది ర్యాలంపాడు జలాశయం. లీకేజీలను అరికట్టి పూర్తిస్థాయిలో నీటినిల్వ (4.20 టీఎంసీల) ఉంచటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా గట్టు ఎత్తిపోతల పరిశీలనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం తక్షణం ర్యాలంపాడు మరమ్మతులకు సంబంధించి కార్యచరణ మొదలు పెట్టాలని ఈఎన్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. మట్టి కట్ట నుంచి వస్తున్న లీకేజీల సమస్యపై గతంలో ప్రైవేటు సర్వే సంస్థ జియో ఫిజికల్, ఎలక్ట్రో రెసిస్టివిటీ విధానంలో పరీక్షలు చేసి మట్టి నమూనాలను సేకరించి చేయాల్సిన మరమ్మతులపై సంస్థ సాగునీటి శాఖకు నివేదిక ఇచ్చింది. అందుకు రూ.153 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు సాగునీటి శాఖ ప్రాథమిక అంచనా. ప్రస్తుతం జలాశయంలో 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తుండటంతో జలాశయం పరిధిలోని 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండేళ్లుగా రబీలో పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది.

కర్టెన్ గ్రౌంటింగ్‌కే మొగ్గు: జూరాల జలాశయం మట్టికట్టలో సైతం జలాశయంలో నీటినిల్వ పూర్తిస్థాయిలో చేసిన క్రమంలో 13 ఏళ్ల కిందట సీపేజీలు వచ్చాయి. వాటిని అరికట్టేందుకు మట్టికట్టపై కోర్‌డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా రంధ్రాలు వేసి గ్రౌంటింగ్ ద్వారా మరమ్మతులు చేపట్టారు. తాజాగా ర్యాలంపాడు జలాశయం మట్టికట్టపై కూడా అదే పద్ధతిలో మరమ్మతులు చేపట్టాలని సాగునీటి శాఖ నిర్ణయించింది. వచ్చే డిసెంబరు నెలలో పనులు మొదలు పెట్టనున్నట్లు ఈఎన్‌సీ మంత్రి పర్యటన సందర్భంగా వెల్లడించారు. అయితే డిసెంబర్‌లో పనులు మొదలు పెట్టాలంటే ఇంకా 60 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌లు, సీవోడీ ద్వారా డిజైన్స్ అప్రూవల్ అయి టెండర్ల ప్రక్రియ చేపట్టి ఒప్పందాలు పూర్తి చేసి పనులు మొదలు పెట్టడానికి కనీసం 50 రోజుల గడువు పడుతుంది. కాబట్టి అధికారులు అక్టోబరు నెలలోనే కార్యాచరణ మొదలు పెడితే కానీ డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉండదు.

సామర్థ్యం పెంపుపై: గట్టు ఎత్తిపోతల పథకంలో 33 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం ద్వారానే నీటిని ఎత్తిపోసి సాగునీటిని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ర్యాలంపాడు జలాశయంలో నీటినిల్వ నాలుగు టీఎంసీలు ఉంటేనే గట్టు పథకానికి ఆయుష్షు ఉంటుంది. లేని పక్షంలో ఆ పథకమే విఫలమయ్యే పరిస్థితి ఉంటుంది. దీనిపై కూడా మంత్రి పర్యటన సందర్భంగా చర్చకు వచ్చింది. 4 టీఎంసీల సామర్థ్యం నుంచి 6 టీఎంసీలకు పెంచాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేశారు. దానిపైనా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈఎన్‌సీకి సూచించారు. ఇక గుడ్డెందొడ్డి లేదా గట్టు జలాశయాన్నే 15 టీఎంసీల సామర్థ్యం ఉండేలా రూపకల్పన చేయాలన్నది కూడా ప్రభుత్వం మదిలో ఉంది. సామర్థ్యం పెంచి స్టోరేజీ జలాశయాలుగా మార్చులు చేసి అవసరం ఉన్న సమయంలో జూరాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు రబీలో సాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపాలని కూడా అనుకుంటున్నారు. అయితే వీటన్నింటికి అడుగు ముందుకు పడాలంటే తొలుత డీపీఆర్‌లు వెనువెంటనే ఆర్థిక శాఖ ఆమోదాలు, తదనంతరం ఆక్తుల పూర్తి అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ జరిగితే తప్ప అనుకున్న లక్ష్యాలు పూర్తి కావు.




శాకంబరిగా జములమ్మ

శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గద్వాల పుర పరిధిలోని జమ్మిచేడు జములమ్మ అమ్మవారు నాలుగో రోజైన ఆదివారం భక్తులకు శాఖంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం

ముద్దబంతులు విరిసె.. బతుకమ్మ మురిసె!



బాలానగర్ మండలం గుండేడ్‌లో తోట

దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లోని తోటలో నిలబడి చిత్రాలు దిగుతున్న ఓ కుటుంబం


ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలనే దేవతగా పూజించటం బతుకమ్మ పండగ ప్రత్యేకత. పల్లెల్లో బాలికలు నిత్యం వివిధ పూలతో బతుకమ్మలు తయారు చేసి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. ఈ పండగ వేళ ఉండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటికే బంతి, ఇతర పూలతోటలు సాగు చేశారు. దేవరకద్ర మండలం గోప్లాపూర్, బాలానగర్ మండలం గుండేడ్ గ్రామాల్లోని రైతుల పూలతోటలు ఇలా విరగబూసి అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు బంతితోటలోకి వెళ్లి చరవాణులతో చిత్రాలు దిగుతూ మురిసిపోతున్నారు. కాసేపు అక్కడే సేదతీరుతున్నారు. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం

మనసు పెడితే.. లక్ష్య ఛేదన సాధ్యమే!



'పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.'
-స్వామీ వివేకానంద



న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: విజయాలు గాలి వాటంగా ఎప్పుడూ రావు. అదేదో సినిమాలో అన్నట్టు వంద కాదు.. రెండు వందల శాతం ప్రయత్నిస్తే ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు. సాధించాలనే తపన, అందుకు తగినట్లుగా శ్రమిస్తే విజయ తీరాలు వెతుక్కుంటూ మీ వద్దకే వస్తాయి. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య రాష్ట్రంలోనే అధికంగా ఉంటోంది. ఇందుకు మనకు మనమే కారణం కాదా.. బోధనా లోపాలు, వసతులు లేవనే వాదనలు పక్కన పెట్టండి.. మన విజయానికి మనం చేస్తున్న కృషి ఎంతో ఆలోచించండి.. అప్పుడే ఇక రంగంలోకి దిగండి. విజయలక్ష్మి మిమ్మల్నెందుకు వరించదు. అది చదువైనా.. ఉద్యోగమైనా..

- నారాయణపేట జిల్లా కోస్గి పురపాలిక పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్ కుమార్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే అయిదు ఉద్యోగాలు సాధించాడు. నీటి పారుదల శాఖ ఏఈఈ, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకునిగా, పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారిగా, పంచాయతీరాజ్ ఏఈతో పాటు, గ్రూప్-4కు ఎంపికయ్యారు.
- మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన మహ్మద్ సుభాన్ మూడు ఉద్యోగాలు సాధించారు. వేర్వేరు గురుకులాల్లో రెండు అధ్యాపక పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శిగానూ ఉన్నారు.
- కొల్లాపూర్‌లోని చుక్కాయపల్లికి చెందిన స్వప్న జవహర్ విద్యాలయంలో డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది.

- గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పాఠ్య పుస్తకం చదవడం అంశాల వారీ ప్రాధాన్యత తెలుసుకోవచ్చు.
- తెలుగులో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా సాధన చేయాలి. చక్కటి దస్తూరి ప్రధానం.
- ఇతర వ్యాపకాలు తగ్గించి చదువుపైనే దృష్టి పెట్టాలి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.
- హిందీ వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. నేర్చుకోవడం, ఇతర విద్యార్థులతో మాట్లాడుతూ ఉండటం ద్వారా పట్టు సాధించవచ్చు.
- ప్రణాళికా ప్రకారం ఇంగ్లిషు గ్రామర్ నేర్చుకోవాలి. తోటి స్నేహితులతో చర్చించి లెటర్ రాయడం అలవాటు చేసుకోవాలి. అపరిచిత గద్యభాగంపై సాధన చేయాలి.
- గణితంలో ప్రాథమిక భావనలు(కాన్సెప్ట్) బాగా నేర్చుకోవాలి. ప్రతి రోజూ రెండేసి లెక్కలు సాధనచేసినా పరీక్షల నాటికి 500 నేర్చుకోవచ్చు.
- సైన్స్ చిత్ర పటాలు బాగా నేర్చుకోవాలి. విద్యార్థులతో కలసి చిత్రాలు వేయడం, సొంతంగా సాధన చేయాలి. ఇష్టమైన, సులభమైన పాఠ్యాంశాలను బాగా నేర్చుకోవాలి.
- సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లను చూడటం, దేశాలు, రాష్ట్రాలను గుర్తిస్తూ నేర్చుకోవడం, చరిత్రను గుర్తించుకునేలా పుస్తకాలు చదవడం.



ఇప్పటి నుంచే: తరగతి ఏదైనా విద్యార్థి వారి సామర్థ్యాలకు తగ్గట్లుగా రాణించడం ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో గతేడాది పదో తరగతిలో 44,898 మంది పరీక్షలు రాస్తే, 5,575 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 36 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తే.. 30 శాతానికిపైగా ఫెయిలయ్యారు. వీరు పరీక్ష తప్పడంలో ఇతర కారణాలతో పాటు స్వ తప్పిదాలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు మనసా వాచా కర్మణా పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా 5 నెలలకు పైగా సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళిక బద్ధంగా చదవగలిగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు. జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయవచ్చు.



ఇలా చేయాలి

- నిరంతర అభ్యసనం ప్రధానం. దీని ద్వారా అనేక సమస్యలకు సమాధానాలు సొంతంగా తెలుసుకుంటారు.
- ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వాటిని నేర్చుకొని అమలు చేయాలి.

త్రికరణ శుద్ధితో చదవాలి: కొందరు విద్యార్థులు చేయాల్సింది చేయకపోవడం, అవసరం లేనిది చేస్తుండటంతో వెనుకబడిపోతున్నారు. ఇలా కాకుండా ప్రతి విద్యార్థి ఎందుకు చదవాలి? లక్ష్యం ఏమిటనేది తెలుసుకోవాలి. వారిలో ఎదగాలనే కోరిక ఉండాలి. ప్రతి విద్యార్థికి చదువు చిట్టచివరి లక్ష్యం కావాలి. త్రికరణ శుద్ధితో చదవాలి. అందుకు అనుగుణంగా శ్రమిస్తే రాణించడం పెద్ద కష్టమేమీకాదు. మూలాలపై శ్రద్ధ పెట్టి ముందుకెళితే తప్పకుండా విజయం సాధిస్తారు.



-డా.శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణులు


సర్పాలన్నీ విషపూరితం కాదు



మన్ననూరులో పాములపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు సదాశివయ్య, ఎఫ్ఎస్ఓ రామమూర్తి

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పరిసరాల్లో కన్పించే సర్పాలన్నీ విషపూరితమైనవి కావని అందులో కొన్ని మాత్రమే విషపూరితమైనవని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదాశివయ్య పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మన్ననూరులో నిర్వహించిన పాముల ప్రదర్శనలో పాములపై అవగాహన కల్పించారు. పాములు పర్యావరణ పరిరక్షణలో పాములది కీలక పాత్ర అన్నారు. పంటలకు చేటు చేసే ఎలుకలు, చిన్న చిన్న జీవులను పాములు తింటాయన్నారు. మన పరిసరాల్లో ముఖ్యంగా 8 రకాల సర్పాలున్నాయని అందులో నాగు, కట్ల పాము మాత్రమే విషపూరితమైనవన్నారు. పాములను చంపకుండా వదిలేస్తే పొలాల్లోని ఎలుకలు, చిన్న కీటకాలను తిని జీవిస్తాయన్నారు. తమకు ప్రమాదం ఉందని భావించిన సందర్భంలోనే పాములు కాటేస్తాయన్నారు. వాటికి మనం ఏ హానీ తలపెట్టకపోతే అవి మనను ఏమీ చేయవన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పాములను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రామమూర్తి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

రూ.2.79 కోట్లతో అలంకరణ



ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాతను రూ.2.29 కోట్ల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వచ్ఛందంగా అలంకరణకు నగదును సమర్పించారు. తెల్లవారుజామున ప్రారంభమైన అలంకరణ మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య దంపతులు అష్టోత్తర నామావళి పారాయణం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం ధర్మకర్తల మండలి నేడు ప్రమాణస్వీకారం

భోగ మహేశ్వరంలో ఏర్పాట్లు ● హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ



నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరం ఆలయం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రముఖ శైవ క్షేత్రం ఉమామహేశ్వర ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉమామహేశ్వరం చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార సభలో పాల్గొని మాట్లాడనున్నారు. తరువాత అచ్చంపేటకు చేరుకొని మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల సమావేశంలో పాల్గొననున్నారు.

- ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గంలో 14 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొండ దిగువన భోగ మహేశ్వరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా పులిజాలకు చెందిన బీరం మాధవరెడ్డిని నియమించారు. కొండపైకి రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని మంత్రికి కొత్త పాలకవర్గం వినతిపత్రం అందజేయనుంది.

పట్టపగలే.. దొంగ దొంగ..!



వస్త్రాలను చిందర.. వందర వేసిన దృశ్యం(పాత)



న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

దొంగతనాలు అంటే చిమ్మ చీకట్లో జరిగేవి. ఒకప్పుడు ఏదైనా చోరీ జరిగినప్పుడు ఇది ఏ ముఠాపని అయి ఉంటుందో అన్న కోణంలో పోలీసులు విచారించేవారు. ఇటీవల కాలంలో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం చోరీలు జరగడం పరిపాటిగా మారింది. మామూలు వ్యక్తులుగా సంచరిస్తూ, తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇరుగు,పొరుగు వారికి కూడా అనుమానం రాని రీతిలో తాళాలను కోసేసి గుంభనంగా పని కానిచ్చేస్తున్నారు. పట్టణాల్లో సాంకేతికత అందుబాటులోకి రావడంతో సులువుగా పట్టుబడతామని భావించి తెలివిగా గ్రామాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్నవారి స్థితిగతులను ముందే అధ్యయనం చేస్తున్నారు.

- పల్లెల్లో సీసీ కెమెరాలు వంటి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, జనం పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడంతో పట్టపగలు వారి పని సులువు అవుతోంది. గతంలో జరిగే దొంగతనాలను చాలా వరకు చరవాణిల ఆధారంగానే కనుగొనే వారు. దొంగలు తెలివిగా చరవాణులను వెంట తీసుకురాకుండా ద్విచక్రవాహనాలపై గ్రామాలకు చేరుకొని తమ పని చేసుకొని ఉడాయిస్తున్నారు. చుట్టాల ఊరికి వచ్చినట్లు కలర్ ఇస్తూ ఎవరికీ అనుమానం రాని రీతిలో సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.



కాచ్‌వార్ గ్రామంలో చోరీకి గురైన ఆభరణాల పెట్టెలు (పాత)

ఏం చేయాలి?

- పట్టపగలు తాళం వేసుకుని వెళ్లకుండా ఇంట్లో ఎవరినైనా ఉంచాలి. తప్పనిసరి వెళ్లాల్సివస్తే ఇరుగు, పొరుగువారిని అప్రమత్తం చేయాలి. ప్రస్తుత రోజుల్లో చరవాణి లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు చరవాణికి సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. మార్కెట్‌లో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.
- విలువైన వస్తువులు, బంగారం వంటివి బయటకు వెళ్లేటప్పుడు తెలిసిన వారికి అప్పగించాలి.
- గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే గట్టిగా ప్రశ్నించి నిర్ధారించుకోవాలి.



మచ్చుకు కొన్ని ఘటనలు

- మక్తల్ మండలం కాచ్‌వార్‌లో అశోక్ రెడ్డి ఇల్లు ఊరికి చివరన ఉండటం, తాళం వేసి ఉండటంతో పట్టపగలు చోరీ జరిగింది. కాట్రేవ్‌పల్లి, మంథన్‌గోడ్ గ్రామాల్లోనూ పట్టపగలు చోరీలు జరిగి నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఊట్కూరు మండలం చిన్నపొర్లలోనూ పట్టపగలు నగదు, డబ్బులు దొంగతనం చేశారు. నారాయణపేట మండలం పెద్దజట్రంలో అదే రీతిలో జరిగింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో ఏకంగా ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసి నగదు దోపిడీ చేశారు.
- ఇటీవల కోస్గి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం కట్టేందుకు పేట వచ్చారు. రూ.3లక్షలకు పైగా నగదు ఉన్న బ్యాగును కారులో ఉంచి రోడ్డుపై వాహనం నిలిపి బ్యాంకులోకి వెళ్లాడు. అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారును వెంబడించి అదును చూసి కారు అద్దాలు పగలగొట్టి అపహరించుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సీసీ కెమెరాలో అంతా రికార్డు అయినా ఇంతవరకు దొంగలు దొరకలేదు.
- నారాయణపేట జిల్లాలో 97, మొత్తం ఉమ్మడి జిల్లాలో 550 వరకు చోరీ ఘటనలు జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగాయి. వాటిని విశ్లేషించినప్పుడు పట్టపగలు దొంగతనాలు ఎక్కువగా జరగడం పోలీసులను నివ్వెరపరుస్తోంది.


జోగులాంబకు ఏపీ ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కర్నూల్ కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ: ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.



భిన్నంగా నడపాలని..!

నేటితరం చిన్నారులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వినూత్న ప్రయోగాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాలనే తపన వారిలో కనిపిస్తోంది. భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామంలో ఓ బాలుడు తన సైకిల్ చక్రాలకు ఉన్న రెండు టైర్లను తొలగించాడు. కేవలం రిమ్‌లతోనే సైకిల్‌ను తొక్కుతూ ఇలా 'ఈనాడు' కెమెరాకు చిక్కాడు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని, దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాలు, రాజ్యాంగాలకు రక్షణ లేదని, ఈ సమస్యలకు రక్షణగా నిలిచి దాని కోసం పోరాటం చేసేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సీపీఎం కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలసి తమ్మినేని వీరభద్రం లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద వ్యక్తుల చేతుల్లో పాలన సాగుతుందని, ఆర్థిక సంపద అంతా అదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారన్నారు. రైతు రుణమాఫీలో ఇంకా 18 లక్షల మందికి రూ.17 వేల కోట్లు బ్యాంకులో వేయాల్సి ఉందని, దాని కోసం రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. భాగ్యనగరంలో ఆక్రమించిన చెరువుల కాల్వలను వాటిని పునరుద్ధరించాలన్నా పేరుతో ప్రభుత్వం హైడ్రా పేరిట కూల్చివేతలు ప్రారంభించిందని, దీనిని సీపీఎం పార్టీ వ్యతిరేకించడం లేదని కానీ, పేదల జోలికి వస్తే మాత్రం పూర్తిగా ఖండిస్తామన్నారు. నల్లగొండ జిల్లా వెంట ప్రవహించే మూసి నీటితోనే పొలాలు పండించే పరిస్థితి ఆయా ప్రాంతాల్లో ఉందని వీటి పై దృష్టి పెట్టకుండా సుందరీకరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాహితం కోరుతూ ప్రజల తరపున పోరాటానికి మనం చేయాల్సిన పని చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, విజయరాములు, అర్జున్, పుట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : లంకాల గ్రామానికి చెందిన దుప్పల్లి శ్రీనివాసులు, అతని కుమారుడు రాముతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై రాంపూర్ గేటు నుంచి సొంతూరు లంకాల వస్తున్నారు. లంకాల చెరువుకట్ట దాటిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరుకు చెందిన బులెరో వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి క్షతగాత్రులయ్యారు. శ్రీనివాసులు(45) తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందారు. రాము కుడికాలుకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు.

కారు బోల్తాతో మరొకరు..

ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

రోడ్డు ప్రమాద మృతుడు ఛత్తీస్‌గఢ్ కూలీ

గాయపడిన మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం 'ఈనాడు' పాఠకులకు విదితమే. వారిని ఛత్తీస్‌గఢ్ కూలీలుగా పోలీసులు గుర్తించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ముర్హ(54), కాలురాం రెండు వారాల క్రితం బతుకుదెరువు కోసం జడ్చర్లకు వచ్చారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆ ఇద్దరూ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వచ్చారు. జాతీయ రహదారి-44పై ఫ్లైవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టిండి. ముర్హ అక్కడికక్కడే మృతిచెందగా కాలురాం తీవ్రంగా గాయపడ్డాడు. కాలురాంను హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. ముర్హ కుమారుడు రాంనారాయణ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.



చికెన్ ధరలు


ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్... దేవర, సత్యం సుందరం, శ్వాగ్ **అయిజ: శివసాయి:** దేవర, **భువనేశ్వర్:** బహిర్భూమి, యమకంత్రి, **మాధవ్:** శ్వాగ్

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

త్రిప్ట నిధుల కోసం.. ఎవరికీ డబ్బులు చెల్లించొద్దు


చేనేత ఏడీ గోవిందయ్యతో ముఖాముఖి

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : వ్యవసాయం తరువాత అత్యధిక మంది ఆధారపడ్డ చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్యాలయంలో సిబ్బంది లేకున్నా కార్మికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జోగులాంబ, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య అన్నారు. కార్మికులు, ప్రభుత్వం మూడేళ్ల పాటు జమ చేసిన త్రిప్ట నిధులు అందించడం, నేతన్న రుణ మాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఏడీతో 'న్యూస్ టుడే' ముఖాముఖి.

? నేతన్నలకు రుణ మాఫీ ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?

✔ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జోగులాంబ, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 1,200 మంది కార్మికులకు సంబంధించిన రూ.12 కోట్ల అంచనా ప్రతిపాదనలు ఇటీవలే ప్రభుత్వానికి పంపించాం. తదుపరి ప్రభుత్వం నుంచి జీవో రాగానే దాని ప్రకారం అర్హులైన వారికి రుణమాఫీ వర్తిస్తుంది.

? త్రిప్ట ఫండ్(నేతన్నకు చేయూత) డబ్బులు అందించడంలో ఎందుకు జాప్యం జరుగుతోంది. ఎప్పటిలోగా అందిస్తారు?

✔ ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన నిధుల ప్రకారం త్రిప్ట పథకం నిధులు కార్మికుల ఆర్డీ-2 ఖాతాల్లో జమ చేశాం. మూడు జిల్లాల్లోని 8,147 మంది కార్మికులకు రూ.42 కోట్ల డబ్బులు పండగలోగా అందిస్తాం. ఇప్పటికే వారి సేవింగ్ ఖాతాల్లో జమ చేసేలా బ్యాంకులకు ఆదేశాలిస్తున్నాం.

? త్రిప్ట నిధులొచ్చాయంటే కొందరు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

✔ కార్మికులు ఎవ్వరూ ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించకండి. కార్మికులు వారి ఖాతాల్లో ఎంతైతే జమచేశారో.. అంతకు రెండింతలు ప్రభుత్వం జమ చేసింది. ఆ మొత్తం కార్మికునికే చెందుతుంది. ఎవరైనా దీనికోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా తెలిస్తే మాకు సమాచారం ఇవ్వండి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

? కార్మికుల నైపుణ్యాభివృద్ధికి మంజూరైన చేనేత క్లస్టర్లు అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

✔ మూడు జిల్లాలకు కార్యాలయంలో ఇద్దరు ఏడీవోలు తప్ప ఇతర సిబ్బంది లేకపోవడం వల్ల జాప్యం జరుగుతోంది. ఇప్పటికే అమరచింతలో మొదటి విడత అమలు చేసి, రాయితీపై సామగ్రి అందించాం. అక్కడ సీడీఈ, డిజైనర్ లేకపోవడం వల్ల ఆలస్యమవుతోంది. రాజోలిలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టాం. రాజోలి-2, గట్టు క్లస్టర్లకు సీడీఈ నియామకం జరగాలి. గద్వాలలో 90 శాతం కార్మికులు డబ్బులు చెల్లించారు. త్వరలోనే అన్ని క్లస్టర్లు పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

? కార్మికులు మరణించిన తరువాత చేనేత బీమా అందించడానికి కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి?

✔ బీమా లబ్ధి కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా మా దృష్టికి రాలేదు. ఈ విషయంలో ఎవరికీ డబ్బులు ఇవ్వరాదు. ఏ సమస్య ఉన్నా నేరుగా నన్ను సంప్రదించాలి. ప్రభుత్వం నుంచి ఎప్పుడు వచ్చిన డబ్బులు అప్పుడు కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

పరిశ్రమల ఏర్పాటుపై మంత్రికి వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

అయిజ, న్యూస్‌టుడే: ఉపాధి కల్పనలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మంత్రి జోగులాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు అలంపూర్‌కు వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు అయిజ నుంచి అలంపూర్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో గత పదేళ్లుగా భారాస ప్రభుత్వం ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయకపోవడంతో వలసలు వెళుతున్నారని తెలిపారు. ఇక్కడి ప్రజల అవసరాల దృష్ట్యా పరిశ్రమల ఏర్పాటు అనివార్యమని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ దొడ్డెప్ప, కుమార్, మధుకుమార్, మద్దిలేటి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ భర్తకు అస్వస్థత

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల దర్శనానికి ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సమేతంగా వచ్చారు. వారితో పాటు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య దంపతులు వచ్చారు. దర్శన అనంతరం జోగులాంబ ఆలయ సన్నిధిలోని ఆశీర్వచన మండపం వద్ద తిరుపతయ్య అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే అలంపూర్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా వడ్డే ఓబన్న వర్ధంతి

గట్టు, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆదివారం వడ్డే ఓబన్న వర్ధంతిని భవన నిర్మాణ కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. భవన నిర్మాణ కార్మికులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, తోటరాముడు, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం: సీపీఎం

అలంపూర్, న్యూస్‌టుడే: సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ పట్టణంలో పార్టీ మండల మహాసభను కేవీపీయస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన మూడేళ్ల పోరాటాన్ని సమీక్షించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. పురపాలికలో కందకం పూడ్చాలి, వరద బాధితులకు ఇళ్ల స్థలాలు చూపించాలి, సీసీ రోడ్లు వీధి స్తంభాలు, సమీకృత మార్కెట్ నిర్మాణం, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని దశల వారీగా పోరాటం చేయాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఏడు మందితో మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల కార్యదర్శిగా ఈదన్న, కమిటీ సభ్యులుగా నరసింహ, రఫీ, మధు, రాజు, వెంకటస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థినికి అభినందన

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: గద్వాల పట్టణం ఎర్రమట్టి వీధికి చెందిన జమ్మన్న, పావని దంపతుల కూతురు వైష్ణవి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆదివారం పోరాట సమితి నాయకులతో కలిసి విద్యార్థిని నివాసానికి అభినందించారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ ఎంబీబీఎస్ సీటు వచ్చే దాకా కష్టపడి చదివించడం గర్వించదగ్గ విషయమన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

ఉండవల్లి, న్యూస్‌టుడే: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ కొన్ని కారణాల వల్ల తాను ఓడిపోయినప్పటికీ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని తక్కశిల గ్రామంలో ఆదివారం పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా రెపరెపలాడేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ దొడ్డప్ప, కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాంధీ అడుగు జాడల్లో నడుద్దాం

రాజోలి, న్యూస్‌టుడే: సత్యం, అహింస పునాదులుగా స్వాతంత్య్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఆ మహాత్ముడి అడుగు జాడల్లో నడుద్దామని విశ్రాంత డీఈవో, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. బాపూ బాటలో సత్యశోధన పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం రాజోలి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు స్వాగతం పలికారు.


మాట్లాడుతున్న విశ్రాంత డీఈవో విజయ్‌కుమార్

గాంధీ చౌక్ వద్ద మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, స్వదేశీ విద్యను ప్రోత్సహించాలని, యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమాజ మార్పు కోసం విశ్రాంత డీఈవో చేపట్టిన పాదయాత్ర ఎంతో గొప్పదని ఎంవీఎఫ్ మండల కోఆర్డినేటర్ హన్మిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రమేశ్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్ తదితరులున్నారు.

ఆంజనేయస్వామి సేవలో నాయకులు


బీచుపల్లి ఆంజనేయస్వామి సన్నిధిలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఇటిక్యాల, అలంపూర్, న్యూస్‌టుడే: బీచుపల్లి ఆంజనేయస్వామిని ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం మండలానికి వచ్చిన వారికి పార్టీ నేతలు గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈవో రామన్‌గౌడ్ వారికి స్వామి వారి శేషవస్త్రాలు సమర్పించారు. ఇటిక్యాల, ఎర్రవల్లి మండల అధ్యక్షులు రుక్మందర్‌రెడ్డి, వెంకటేశ్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ సరిత, జోగుల రవి, లక్ష్మీనారాయణరెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● అలంపూర్ జోగులాంబ అమ్మవారిని మల్లు రవి దర్శించుకున్నారు. ఈవో పురేందర్, అర్చకులు, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కట్టకింద తిమ్మప్పస్వామి ఉత్సవాలు


సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారిని

అయిజ, న్యూస్‌టుడే: అయిజలోని కట్టకింద తిమ్మప్పస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అయిజ-గద్వాల మార్గంలో అయిజ సమీపంలో సువిశాలమైన ప్రదేశంలో వెలిసిన స్వామివారి ఉత్సవాల సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సింహవాహన సేవ అంగరంగవైభవంగా కొనసాగింది. స్వామివారి విగ్రహాన్ని సింహవాహనంపై ఊరేగించారు. సింహవాహన సేవకు మహిళలు హారతులు పట్టారు. ఆలయం నుంచి గద్వాల రహదారి వరకు ఊరేగించి తిరిగి ఆలయంలోకి తీసుకెళ్లారు. పల్లకిని మోసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. సింహవాహన సేవలో భాగంగా నిర్వహించిన నందికోల సేవ ఆకట్టుకుంది. వివిధ గ్రామాల నుంచి వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. రాత్రి బాగాపొద్దుపోయినా ఆలయం నుంచి భక్తులు కదలలేదు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీవారు భక్తులు ఇబ్బంది తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు.







శాంతినగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. గద్వాల మార్కండేయస్వామి దేవాలయంలో.. గద్వాల పిల్లిగుండ్ల కాలనీలో.. బీచుపల్లిలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు.. రాజోలి : మానవపాడులో హారతులు.. అలంపూర్: ఖుర్నావురంలో పూజలు

మాతాన్నపూర్ణేశ్వరి!



ఉండవల్లి: భైరాపురం నిత్యభావన ఆశ్రమంలో.. మానవపాడులో దుర్గామాత విగ్రహం వద్ద భక్తులు

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జగజ్జననికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి లలితాసహస్ర నామ పారాయణం చేశారు. సెలవు దినం కావడంతో ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

- న్యూస్‌టుడే బృందం


మల్దకల్: బిజ్వారంలో 108 కలశాలతో మహిళల పూజలు

వాస్కోడగామా రైలుకు ఘన స్వాగతం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్ - వాస్కోడగామా (గోవా) 07039/40 రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభించగా మహబూబ్‌నగర్ స్టేషన్‌కు వచ్చింది. స్థానిక సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈనెల 9 నుంచి అధికారికంగా రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ - వాస్కోడగామా వైపు నడవనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో వాస్కోడగామా - సికింద్రాబాద్ ప్రతి గురు, శనివారాల్లో నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.


స్వాగతం పలుకుతున్న రైల్వే సీనియర్ సిటిజన్లు, అధికారులు

బాధితులకు ఎల్వోసీల అందజేత


ఎల్వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల నియోజకవర్గ పరిధిలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న ముగ్గురికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్వోసీలను ఆదివారం క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అందించారు. మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన జనార్దన్‌కు రూ.2.50 లక్షలు, పుర పరిధిలోని జమ్మిచేడు గ్రామానికి చెందిన రమణమ్మకు రూ.60 వేలు, కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామానికి చెందిన నరసింహారెడ్డికి రూ.14వేల విలువైన ఎల్వోసీలను అందించారు. బండారి భాస్కర్, జంబురామన్‌గౌడ, గడ్డం కృష్ణారెడ్డి, శివరాంరెడ్డి, సతీష్‌కుమార్, రమేష్‌నాయుడు రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలి: సీపీఎం


మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్‌కుమార్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి, దేశ సార్వభౌమత్వానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల విధాన నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు ఆమోదించి, కేవలం అభిప్రాయాన్ని చెప్పమని పార్టీలను కోరడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. అనేక కులాలు, మతాలు ఆచార వ్యవహారాలు, విభిన్న సంస్కృతులు కలిగిన దేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల ఖర్చు ఎక్కువవుతుందని జమిలి ఎన్నికలకు వెళ్లడం విడ్డూరమన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ పెట్టిన ఖర్చు 15 శాతం అయితే, పార్టీలు పెట్టిన ఖర్చు 85 శాతమన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, నాయకులు మమత, ఉప్పేరు నర్సింహా, తిమ్మప్ప, బాలకృష్ణ, తిరుమలేశ్, భీమేశ్, రామాంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న ఎస్సై విజయభాస్కర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ పట్టణంలోని ఎక్లాస్‌పూర్ రహదారి సమీపంలో ఉన్న తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రోజూ మాదిరిగానే ఆలయ అర్చకులు శనివారం సాయంత్రం పూజా కార్యక్రమాలు ముగించుకుని ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు గేటుకు ఉన్న తాళాన్ని విరగ్గొట్టి లోనికి చొరబడి రెండు హుండీలను ధ్వంసం చేసి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయ పరిసరప్రాంతాలకు వెళ్లిన వారు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా


జాతీయ రహదారి పక్కన బోల్తా పడిన కారు

ఉండవల్లి, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం ఉండవల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. గద్వాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన గోవిందు కారులో జాతీయ రహదారి గుండా ఉండవల్లి స్టేజీ సమీపంలో ఎర్రవల్లి వైపు వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పింది. దీంతో కారు జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. సంఘటనలో కారులో ఉన్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: గద్వాల మండలం పుటాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం వేకువజామున ఓ ఇసుక టిప్పర్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు గద్వాల గ్రామీణ ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు. కొత్తకోట నుంచి గద్వాల పట్టణానికి ఎల్లస్వామి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం


అయ్యమ్మకు సాయం అందజేస్తున్న పోలీసులు

మానవపాడు, న్యూస్‌టుడే: ఎ.బూడిదపాడు గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ రాముడు హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. హైదరాబాద్‌లో ఆయనతో కలిసి విధులు నిర్వహించిన 1995 బ్యాచ్‌కు చెందిన సహచర పోలీసు ఉద్యోగులు ఆదివారం ఆయన స్వగ్రామానికి చేరుకొని రాముడు తల్లి అయ్యమ్మకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల వరండా

అడవిరాలుచెర్వు ప్రాథమిక పాఠశాలలో 93 మంది విద్యార్థులుండగా కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. గదుల కొరతతో విద్యార్థులను ఒకే గదిలో ఉంచి పాఠాలు బోధిస్తున్నారు. వరండా పూర్తిగా పెచ్చులూడి ప్రమాదకరంగా మారడంతో ప్రమాదం పొంచి ఉంది. మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతామని ప్రధానోపాధ్యాయుడు రాఘవులు వివరించారు.

-న్యూస్‌టుడే, మల్దకల్





అధ్వాన రహదారితో అవస్థలు

రాజాపూర్, బైనపల్లి, కొత్తపల్లి, సింధనూరు గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డునిండా కంకరతేలి వాహనాలు వెళ్లడానికి వీల్లేని విధంగా తయారైంది. దీంతో ఆర్టీసీ సర్వీసులను కుదించారు. ఏళ్ల తరబడి పరిస్థితి ఇలానే ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎంపీడీవో వెంకటయ్య స్పందిస్తూ రహదారి పరిస్థితి ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

-న్యూస్‌టుడే, అయిజ

రోడ్డుపైనే వ్యర్థాలు

మల్దకల్ వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ప్రధాన రహదారిపై వ్యర్థాలు, చెత్త, చెదారం వేయడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వ్యర్థాల మురుగుతో దుర్వాసన భరించలేని విధంగా మారిందని ఆలయానికి వచ్చే భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుమలయ్యను సంప్రదించగా కార్మికులతో శుభ్రం చేయిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, మల్దకల్





ప్రమాద నిలయాలుగా మలుపులు

శాంతినగర్ నుంచి కొయిలదిన్నెకు వెళ్లే రహదారిపైన ఉన్న మలుపు ఇది. దీనికి తోడు కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శాంతినగర్ నుంచి పైపాడు, బుడమర్సు నుంచి పైపాడుస్టేజి, జూలకల్‌స్టేజి నుంచి కొంకల, ఇదే స్టేజి నుంచి జూలకల్, జక్కిరెడ్డిపల్లి, రామాపురం నుంచి జిల్లేడుదిన్నెలకు వెళ్లే రహదారులపైన ఇలానే మలుపులున్నాయి. కనీసం కంపచెట్లయినా తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, శాంతినగర్

విద్యుత్తు తీగలతో జాగ్రత్త

అమరవాయి గ్రామ బీసీ కాలనీలో ఇంటి మిద్దెలపై విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తాము ఇళ్ల వద్ద లేనప్పుడు పిల్లలు మిద్దె ఎక్కి తీగలు ప్రమాదవశాత్తు పట్టుకుంటే ప్రాణనష్టం చోటుచేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. తరచు వర్షాలు కురుస్తుండటంతో తీగలు తక్కువ ఎత్తులో ఉన్నందున ఇళ్లకు ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపడతామని సబ్‌ఇంజనీర్ అబ్రార్ అహ్మద్‌ను తెలిపారు.

-న్యూస్‌టుడే, మానవపాడు

